
సూర్య
www.suryaa.com
18 వ వసంతంలోకి ...
బుధవారం 19 ఫిబ్రవరి 2025 , పేజీలు 05
అదిలాబాద్ - మంచిర్యాల

సూర్య
www.suryaa.com
★ నిర్మల్ ★ కొమురంభీం ఆసిఫాబాద్

## వేసవిలో సాగు-త్రాగు నీటి సమస్య లేకుండా
# ప్రణాళికబద్ధమైన చర్యలు

- వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుంది
- రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలి
- త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి




**అమంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

రానున్న వేసవికాలంలో సాగునీటికి, త్రాగునీటికి ఎలాంటి సమస్య లేకుండా ప్రణాళికబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీరు, విద్యుత్ సరఫరా, రైతు భరోసా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటి సరఫరాకు చర్యలు తీసుకోవడంతో పాటు రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. ( మిగితా..2లో )

## వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా
# ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

**నిర్మల్ ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్**



వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులనుఆదేశించారు.మంగళవారంసాయంత్రం హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి త్రాగునీరు, విద్యుత్ వినియోగం, రైతు భరోసా, ఆహార భద్రత కార్డుల పరిశీలన,రబీ సీజన్ సాగు నీరు, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. (మిగితా...2లో )

## అధికారులు మారినా
# మారని సమాచార బోర్డు చిరునామా

**- నూతన కమిషనర్ బాధ్యతలు చేపట్టి 10 రోజుల పై మాటే- సమాచార హక్కు చట్టం బోర్డు లో మారని పేరు**

**మంచిర్యాల ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్**




మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం నందు, ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డులో గతంలో పనిచేసిన అధికారులు,అప్పటి అధికారుల ఫోన్ నెంబర్లు ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి నిలవటద్దమని ప్రత్యక్షంగా చెప్పవచ్చు.గతంలో మున్సిపల్ కమిషనర్ గా మారుతి ప్రసాద్ విధులు నిర్వర్తించారు.జిల్లా అధికారులు చేపట్టిన బదిలీల సందర్భంగా ప్రస్తుతం తౌటం శివాజీ కొత్త నగర మున్సిపల్ కమిషనర్గా బాధ్యతలు చేపట్టారు.అయితే ఇప్పటివరకు సమాచార చట్టం బోర్డులో అధికారుల పేరు మార్చకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువటద్దమని ప్రజలు,సంఘాల నాయకులు వాపోతున్నారు.

# వేసవిలో త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి



**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

**జైనూర్ ఫిబ్రవరి 18 సూర్య మేజర్ న్యూస్**

రానున్న వేసవికలంలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి సమస్య లేకుండా కార్యచరణ రూపొందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లాలోని జైనూర్ మండలం దుబ్బగూడ గ్రామపంచాయతీలో పర్యటించి మిషన్ భగీరథ నీటి నాణ్యత, త్రాగునీటి కొరకు తీసుకోవలసిన చర్యలపై పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు త్రాగునీటి ఎద్దడి లేకుండా కార్యచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీటిని అందించాలని, ఈ నేపథ్యంలో నీటి ట్యాంకుల శుభ్రత, పైప్ లైన్ల మరమ్మత్తులను వేగవంతం చేసి లీకేజీ సమస్య లేకుండా నీటి సరఫరాకు చర్యలు



తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచి నూతన మెనూ అమలు చేస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోలో తరలిస్తున్న
# గంజాయి పట్టివేత

**గుడిహత్నూర్,ఫి,మేజర్ సూర్య న్యూస్**

మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద ఓ వ్యక్తి ఆటోలో ఆరు కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని డి.ఎస్పి నాగేందర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి నాగేందర్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద ఇచ్చోడ సిఐ భీమేష్,ఎస్సై మహేందర్ పోలీసు సిబ్బందితో వాహనాల తనిఖీ చేపడుతుండగా ఇంద్రవెల్లి వైపు నుండి గుడిహత్నూర్ వైపు అనుమానాస్పదంగా వస్తున్న ఆటోను ఆపి పోలీసులు తనిఖీ చేయగా అందులో ఆరు కిలోల గంజాయి లభించగా పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో గంజాయిని తరలిస్తున్న ఇంద్రవెల్లి మండలం అందునాయక్ తాండా గ్రామానికి చెందిన పడ్వాల్ కపూర్ సింగ్ ను పోలీసులు అదుపులో తీసుకొని విచారించగా గుడిహత్నూర్ మండలంలోని తోయగూడ గ్రామానికి చెందిన తోడసం గోద్రు వద్ద కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు తెలిపాడు. నిందితుడు తెలిపిన సమాచారం మేరకు పోలీసులు గోద్రు ఇంటికి వెళ్లి అతని ఇంటిని తనిఖీ చేయగా అతని ఇంట్లో కిలో గంజాయి, ఐదువేల నగదు, ఒక సెల్ ఫోన్ లభించడంతో వాటిని స్వాధీన పరుచుకొని అతనిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మండలంలో ఎవరైనా రైతులు గంజాయిని పండిస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా




శిక్షిస్తామన్నారు. యువత గంజాయిని సేవించడం వల్ల అనేక రకాల ఇబ్బందులకు గురై చెడు వ్యసనాలకు లోనవుతున్నారని అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ. భీమేష్,ఎస్ఐ. మహేందర్‌ను డి.ఎస్పి నాగేందర్ అభినందించారు.

సూర్య

బుధవారం 19 ఫిబ్రవరి 2025

# వేసవిలో సాగు-త్రాగు నీటి సమస్య లేకుండా ప్రణాళికబద్ధమైన చర్యలు

## - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



**మొదటి పేజీ తరువాయి..**

వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని, అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్కార్డుల కొరకు అందిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎం.ఎల్.సి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాలను మినహాయించి మిగతా జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు రేషన్ కార్డులు అందించాలని తెలిపారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. దినపత్రికలు, సోషల్ మీడియాలలో వచ్చే ప్రతికూల వార్తలపై సంబంధిత అధికారుల సమన్వయంతో స్పందించి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని అన్ని ప్రాంగాలకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పధరం అందించే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కొరకు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సజావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్రావు, హరికృష్ణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

## ప్రభుత్వ పథకాలను రైతులు

# సద్వినియోగం చేసుకోవాలి

## - చెన్నూరు ఏడీఏ బానోత్ ప్రసాద్



**మందమర్రి,ఫిబ్రవరి 18,సూర్య మేజర్ న్యూస్.**

వ్యవసాయ రంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని చెన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ అన్నారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలో రైతులతో వ్యవసాయ అనుబంధ రంగాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, రైతులందరికీ ఇట్టి పథకాల పట్ల అవగాహన కలిగి ఉంటే, పథకాల వినియోగం జరిగి రైతులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. అలాగే ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ వంటి పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యానవన అధికారి కల్యాణి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు, సబ్సిడీ వివరాలు, సూక్ష్మ సేద్య పరికారాలపై సబ్సిడీ, పందిరి కూరగాయల సాగు, ఆయిల్ పామ్ లో అంతర పంటగా కొకోవా సాగు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ వంటి పథకాలపై తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ అధికారి రాజేష్ రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పశు సంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖ, మత్స్య శాఖ, పట్టు పురుగుల పెంపకం, తేనెటీగల పెంపకం వంటి అంశాలపై రైతులకు కావలసిన సమాచారం కోసం సంబంధిత శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి వ్యవసాయ శాఖ తోడ్పడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతి కార్యదర్శి సవ్య, రైతులు కమల మనోహర్, ఫిరోజ్, రాయమల్లు, ఆసంపెల్లి రాజయ్య, ఖలీమ్, గౌస్, ముజఫర్, మహేందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కారోబార్ మధు తదితరులు పాల్గొన్నారు.


---

## వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

**మొదటి పేజీ తరువాయి...**

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, రానున్న వేసవిలో త్రాగు నీటి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలందరికీ నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను





గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులందరూ ఎప్పటికప్పుడు ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేయాలన్నారు.

కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి ఈవీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పథకం అందించే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కొరకు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన వెంటనే అర్హులైన వారందరికీ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలను కలెక్టర్ సిఎస్ కు వివరించారు. ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్బిఎస్కే బృందాల ద్వారా ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, అవసరమైన విద్యార్థులకు ప్రత్యేక ఆహారం మందులు తీసుకునే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వసతి గృహ విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించి అమలుపరుస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను ఈ సందర్భంగా సిఎస్ అభినందించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లు, ఇరిగేషన్ ఎస్ఈ రవీందర్, డిపివో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, జాదవ్ కృష్ణ, డిఎస్ఓ కిరణ్ కుమార్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

---

## సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకెల్లాలి

### - కాగితపు రహిత ఉత్తర ప్రత్యుత్తరాలలో బెల్లంపల్లి ఏరియా ముందుండాలి - బెల్లంపల్లి ఏరియా జిఎం ఎం.శ్రీనివాస్

### - శాప్ ఫైల్ లైఫ్ సైకిల్ పై అధికారులకు శిక్షణ

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్:**

కాగితపు రహిత ఉత్తర,ప్రత్యుత్తరాల సేవలను అమలులోకి తీసుకువస్తున్న సింగరేణి సంస్థ చర్యలను వేగవంతం చేసింది. పర్యావరణహిత చర్యల్లో భాగంగా కాగితాలకు ప్రత్యామ్నాయంగా వినియోగించే శాప్ ఫైల్ లైఫ్ సైకిల్ పై మంగళవారం బెల్లంపల్లి




ఏరియా అధికారులకు జిఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో ఐటీ విభాగం ఆద్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిఎం.ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలోని పలు రంగాలు, పరిశ్రమలు సాంకేతికతను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి దిశగా దూసుకు పోతున్నాయని అన్నారు. కాగితపు రహిత ఉత్తర ప్రత్యుత్తరాలలో బెల్లంపల్లి ఏరియా ముందుండాలని అధికారులకు సూచించారు. అధికారుల సందేహాలను కార్పోరేట్ ఐటీ అధికారులు నివృత్తి చేశారు. ఏప్రిల్ నుండి సింగరేణి వ్యాప్తంగా పేపర్ లెస్ ప్రక్రియ అమలు కానుందన్నారు. ఈ కార్యక్రమమలో ఎస్ఓటుజిఎంకె.రాజమల్లు, పిఓ ఎం.నరేందర్,పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఐటీ ఇంచార్జి ముజీబ్, కార్పోరేట్ ఐటీ అధికారులు హర ప్రసాద్, కిరణ్ కుమార్,శంకర్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## సీ గ్రేడ్ విద్యార్థులు ఏ గ్రేడ్ లోకి వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి

**సారంగాపూర్, ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్**

సారంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి రామారావు మంగళవారం సందర్శించారు. పాఠశాల



రికార్డులను,విద్యార్థుల హాజరు శాతం పరిశీలించి, పదవ తరగతి విద్యార్థులలోని సి గ్రేడు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఏ గ్రేడు లోకి తీసుక రావడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. లక్ష్య సాధనలో అర్జున్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివి లక్ష్యం చేరే దిశగా అడుగులు ముందుకు వేయాలన్నారు. విద్యార్థులతో స్నేహ పూర్వక వాతావరణంలో ముఖాముఖిగా మాట్లాడి విద్యార్థులను ప్రోత్సహించారు.డిఈఓతో పాటు ప్రధానోపాధ్యాయురాలు విజయ ,ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మీ సేవ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి

### -దరఖాస్తుపై అదనంగా డబ్బులు వసులు

**పెంబి, ఫిబ్రవరి 18,సూర్య మేజర్ న్యూస్:**

పెంబి మండల కేంద్రంలో గల మీ సేవ కేంద్రంలో ప్రభుత్వం నిర్దేశించిన డబ్బుల కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పెంబి మండలం లోని మందపెల్లి, నాగపూర్, గుమ్మేనా గ్రామానికి చెందిన పలువురు పెంబి తహసీల్దార్ లక్ష్మణ్ కి ఫిర్యాదు అందజేశారు.ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పెంబి మండల ప్రజల నుండి మీ సేవ కేంద్రంలో అదనంగా డబ్బులు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. గతంలో కూడా ఇదే మీ సేవ కేంద్రంపై ఇదే విషయంపై పలు మార్లు ఆరోపణలు, ఫిర్యాదులు కూడా రాకపోలేదు.సంబంధిత అధికారులు స్పందించి మీ సేవ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఇందులో వెంకటేష్, రమేష్, వెంకట్రాములు, సాయిలు తదితరులు ఉన్నారు.



### 308 కంపార్ట్మెంట్‌లో

# అక్రమంగా వెలసిన గుడిసెలు

### - తొలగించిన అటవీ అధికారులు

**జన్నారం, ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్**

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో గల 308 కంపార్ట్ మెంటులో అక్రమంగా వెలసిన గుడిసెలను అటవీ అధికారులు తొలగించారు.







గత కొన్ని రోజులుగా అనుమానం రాకుండా కొందరు గిరిజనులు జన్నారం రేంజ్ పరిధిలో గల జన్నారం బీటు 308 కంపార్ట్మెంట్లో కొందరు గిరిజనులు ఎలాంటి సమాచారం లేకుండా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. అక్రమంగా గుడిసెలు వేసుకోవడం చట్టరీత్యా నేరమని వెంటనే తొలగించాలని స్థానిక అటవీ అధికారులు నచ్చచెప్పిన ఖాతరు చేయలేదు. రెండు రోజుల క్రితం మంచిర్యాల ఎఫ్డిపిటి శాంతారామ్ తమ సిబ్బందితో కలిసి అడవిలో పర్యటించారు. ఆ సమయంలో జన్నారం బీటులోకి నడుచుకుంటూ వెళుతున్నప్పుడు ఆ గుడిసెలు కనిపించడంతో ఇదేంటని స్థానిక అధికారులను ఎఫ్డిపిటి శాంతారాం ప్రశ్నించినట్లు తెలిసింది. వెంటనే వాటిని తొలగించాలని స్థానిక ఎఫ్ఆర్ఓ సుష్మారావుకు ఆదేశాలు ఇవ్వడంతో మంగళవారం తెల్లవారుజామున జన్నారం, ఇంధన్ పల్లి రేంజ్ ఆఫీసర్లు సుష్మారావు, కారం శ్రీనివాస్ లా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అటవీ అధికారులు బ్లేడ్ ట్రాక్టర్ తో పాటు జెసిబి ని తీసుకెళ్లి గుడిసెల్లో ఉన్న వారంతా బయటకు వెళ్లాలని హెచ్చరించి గుడిసెలన్నీ వాహనాలతో తొలగించారు. ముందుగా బలరాం అనే గిరిజన నాయకున్ని అదుపులోకి తీసుకొని ఇంధన్ పల్లి రేంజ్ కు తరలించి గుడిసెలన్నీ నేలమట్టం చేశారు. తొలగిస్తున్న సమయంలో గిరిజనులకు అటవీ అధికారులకు కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. ఇదే ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాల నుంచి గిరిజనులు గుడిసెలు వేసుకోవడం అధికారులు తొలగించడం జరుగుతూనే ఉంది. గుడిసెలు నేలమట్టం కావడంతో ఏమి చేయలేక పక్కనే ఉన్న చెట్ల నీడలో ప్రస్తుతం కాలం గడుపుతున్నారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటాం, ప్రాణం పోయినా ఇక్కడి నుంచి వెళ్లిపోవడం జరగదని విలపిస్తూ గిరిజనులు తేల్చి చెప్పారు.

## మార్చ్ 8న జాతీయ లోక్ అదాలత్ - జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేష్

**ఆసిఫాబాద్, సూర్య మేజర్ న్యూస్**

రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు మార్చ్ 8వ తేదీన జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు భవన సముదాయంలో మార్చ్ 8వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో క్రిమినల్, సివిల్, ప్రి లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యలు, వివాహం, కుటుంబ సమస్యలు, మోటార్ వాహనాల ప్రమాదాల కేసులు, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ ఇతర అన్ని రకాల కేసులను ఇరు పార్టీల మధ్య రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంతో కాలం వృధా కాకుండా ఆర్థికంగా కూడా లాభం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం మొదటి బెంచ్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.వి. రమేష్, 2వ బెంచ్ లో సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ, 3వ బెంచ్ లో జూనియర్ సివిల్ జడ్జ్–సిర్పూర్ (టి ), ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్–ఆసిఫాబాద్ జె. అనంతలక్ష్మి న్యాయాధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. మార్చ్ 8వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమ నిర్వహణపై ఈ నెల 20వ తేదీన సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయంలో గల ప్రిన్సిపల్ డిస్టిక్ & సెషన్స్ జడ్జ్ కోర్టు హాల్ నందు పోలీసు ఉన్నతాధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## వికలాంగురాలిపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష మరియు 9 వేల రూపాయల జరిమానా

**కాగజ్ నగర్ ,ఫిబ్రవరి 18.సూర్య మేజర్ న్యూస్**

చింతల మనేపల్లి మండలానికి చెందిన వికలాంగురాలిపై అత్యాచార యత్నం చేసిన కామెర శంకర్‌కు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్ట్ న్యాయమూర్తి యువరాజు తీర్పు ఇచ్చారు.కౌటాల సిఐ ముత్యం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.చింతలమానేపల్లి మండలానికి చెందిన వికలాంగురాలు పై 18/04/2023 న ఉదయం 3 గం.ల సమయంలో అదే గ్రామానికి చెందిన కామెర శంకర్ అత్యాచార యత్నం చేయబోగా, ఆమె వెంటనే బిగ్గరగా కేకలు వేయగా నిందితుడు పరుగులు తీశాడు. వారి కుటుంబ సభ్యులు నిందితుడు శంకర్ అని గుర్తుపట్టారు.పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే గ్రామంలో తమ పరువు పోతుందని అనుకొని,కుటుంబ సభ్యులు మరల విచారించుకొని,ఆ మరునాడుపోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో శంకర్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్ష,9000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.ప్రాసిక్యూషన్ తరపున పిపి జీవీఎస్ ప్రసాద్ వాదించారు.నిందితుడికి శిక్ష పడటంలో కృషిచేసిన కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్ ఎ.ఎస్.ఐ, సి.డి.ఓ బాలాజీ ఏ.ఎస్.ఐలను ఎస్పీ డివి శ్రీనివాసరావు అభినందించారు.

### ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను

## కలిసిన మాల సంఘం సభ్యులు

**నేరడిగొండ ఫిబ్రవరి 19.సూర్య మేజర్ న్యూస్ :**

బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను జిల్లా మాల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే నివాసంలో అదిలాబాద్ జిల్లా మాల సంఘం సభ్యులు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కు అందజేశారు. జిల్లా మాల సంఘం సభ్యులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంపై సవరణలో జరిగిన తప్పులను సరిదిద్ది సుప్రీంకోర్టు జడ్జిమెంట్ లో ఏంపరికల్ డేటా 02 జూన్ 2014 నుంచి ఇప్పటివరకు లబ్ధిదారుల డాటా ను తయారు



చేయాలని అన్నారు. దీనితో ఏ కులం వారు ఎంత లబ్ధి పొందారు ఏ కులం వారు వెనుకబడ్డారు అనేది స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. దీనిపై రానున్న బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను మాల సంఘం నాయకులు కోరారు . వీరి సమస్యలు విన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అధ్యక్షులు కొప్పుల రమేష్, మేకల మల్లన్న, వీర దేవన్న, మెట్టుప్రహలద్, రాజేశ్వర్, మెట్టి కిరణ్, బోథ్ మండల అధ్యక్షుడు ఎలక రాజు, మునీశ్వర సోమన్న, బోడ లక్ష్మణ్, ఉషన్న, భూమేష్ , రమేష్, సురేందర్, సుధీర్, పాశం రాఘవేంద్ర, అశోక్, స్వామి, మండల మాల సంఘం సభ్యులు, తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

## చలో విద్యుత్ సౌదా కార్యక్రమం విజయవంతం చేయాలి

**నిర్మల్ ఫిబ్రవరి18, సూర్య మేజర్ న్యూస్**

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఈనెల 20 న నిర్వహించే చలో విద్యుత్ సౌదా కార్యక్రమం విజయవంతం చేయాలని జేఏసీ కన్వీనర్ సైదు రాజు అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఆర్టిజన్లను సంస్థ రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున ఆర్టిజన్ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ నిర్మల్ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ యుగేందర్ క్రాంతి కుమార్ మహేందర్ స్వామి అశ్వక్, వసీం తదితరులు పాల్గొన్నారు.



## మొట్టమొదటి ఏకగ్రీవ సర్పంచి బద్రి వెంకటయ్య పటేల్ 38వ వర్ధంతి సందర్భంగా ప్యాడ్లు పంపిణీ

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 17, సూర్య మేజర్ న్యూస్.**

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో క్యాతనపల్లి పంచాయతీ మొట్టమొదటి ఏకగ్రీవ సర్పంచి బద్రి వెంకటయ్య పటేల్ 38వ వర్ధంతిని పురస్కరించుకొని వారి మనవడు బద్రి సంతోష్ కుమార్ ఆద్వర్యంలో పట్టణ ఎస్.ఐ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు



చేతుల మీదుగా పదవ తరగతి విద్యార్థినిలకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..క్యాతనపల్లి గ్రామపంచాయితీగా ఉన్నప్పుడు మొట్టమొదటి ఏకగ్రీవ గ్రామ సర్పంచ్ బద్రి వెంకటయ్య పటేల్ 1958 నుండి 1971 వరకు 13 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందించారని వారి జ్ఞాపకార్థం పదవ తరగతి విద్యార్దినుల పరీక్షలను దృష్టిలో ఉంచుకొని గవర్నమెంట్ స్కూలులో చదువుకుంటున్న పిల్లలందరికి ప్యాడ్లు,పెన్నులు అందజేయడం చాలా సంతోషకరమని విద్యార్థినులు చదువుపై దృష్టి సారించి మంచి ఉత్తీర్ణత కనపరచి ఇంకా మరెన్నో విజయాలు సాధించి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని చదువుతున్న పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు.ఈ య్నెక్క కార్యక్రమంలో గ్రామస్తులు,పాఠశాల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గురు హీరా సుఖ జయంతి

**ఆదిలాబాద్ (సాత్నాల )ఫిబ్రవరి 18,సూర్య మేజర్ న్యూస్**

సాత్నల మండలంలోని జమిని గ్రామంలో ఆదివాసీ ప్రధాన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ ధర్మ గురుహీరా సుఖా జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఐటీడీఏ ఏపిఓ మెస్రం మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భూమి మీద పుట్టిన ఆది గురువు హీరా సుఖ అని కొనియాడారు. ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలు ఈ రోజు కనిపిస్తున్నాయంటే హీరా సుఖ గురువు కారణమన్నారు. ఈ రోజు ఆదివాసీ ప్రధాన్ సమాజం



ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు సమాజముకు అతీతంగా ప్రచారం చెయ్యడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పర్ధన్ పురోహిత్ సేవ సమితి అధ్యక్షులు ఉయికే సుదర్శన్ , పర్ధాన్ జనజతి ఉత్తన్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు మెస్రం శంకర్ , సమాజ పెద్దలు కుర్సెంగా యాదవ్ , గెడం యాదవ్ ,మెస్రం ఫరీద్,గేదాం రేణుకా బాయి, కొరియాంగా దదరావు ,మహజన్ కృష్ణ, సోయం హుస్సేన్,సాయం తుల్సిరం,కినాక పూల్చంద్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కేరిర్ గైడెన్స్ అందించిన గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహ

**పెంచికల్పేట్, ఫిబ్రవరి18, సూర్య మేజర్ న్యూస్**

పెంచికల్పేట్ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం కెరియర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ కాగజ్నగర్ డిగ్రీ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీనరసింహం విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు విజయనిర్మల, ఉపాధ్యాయులు ఎస్.కె బడే సాహెబ్ ,గంగాభవాని ,లక్ష్మీ భారతి ,భాగ్యశ్రీ ,ఆత్మారాం ,ఆస్తాబ్ అహ్మద్ ,ధనరాజ్ ,సాదియా తదితరులు పాల్గొనడం జరిగింది.



# జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్**

జిల్లాలో మార్చి 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్యలతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చ్ 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు 10వ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోసిట్ పరీక్ష ఉదయం 9.30 గం.ల నుండి మధ్యాహ్నం 12.50 గం.ల వరకు, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9:30 గం.ల నుండి 11 గం.ల వరకు మినహా మిగతా పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.9 వేల 189 మంది రెగ్యులర్, 221 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షల నిర్వహణలో భాగంగా ప్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.పరీక్ష సమయానికి అనుకూలంగా టి.జి.ఎస్.ఆర్.టి.సి. అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని. ప్రశ్నా, జవాబు పత్రాల సురక్షిత రవాణా కొరకు తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని పరీక్ష కేంద్రాలలో పారిశుద్ధ్యం నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో వార్షిక పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

## సైబర్ నేరాలపై విద్యార్థినిలకు అవగాహన సదస్సు

**రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్.**

రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలికల ఉన్నత



పాఠశాలలో మంగళవారం విద్యార్థినీలకు నేటి సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై జి రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో ఆడవారి పట్ల జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలలో ఆర్థిక దోపిడీ ఏ విదంగా జరుగుతుందో విద్యార్థినులకు వివరిస్తూ,అట్టి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలనీ సూచించారు.ఆడపిల్లలు ఉన్నతమైన విద్యను అభ్యసించి, గొప్ప హోదాలో ఉండేలా లక్ష్యాలను పెట్టుకొనీ, వాటికోసం కష్టపడి చదివి, అన్నీ రంఘాలలో ముందుకెళ్లాలనీ తెలిపారు.ఎవరైనా ఆకతాయిలు దురుసుగా ప్రవర్తించిన, అసభ్యకరంగా ప్రవర్తించిన వెంటనే పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలనీ, మహిళల పట్ల జరుగుతున్న నేరాల కట్టడికోసం రామగుండం పరిధిలో "షీ" టీమ్ నిత్యం పని చేస్తున్నదని వివరించారు. సైబర్ నేరగాళ్ళు వినూత్న పద్ధతిలో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని, వారి ఉచ్చులో పడి చాలా మంది డబ్బులు పోగొట్టుకుంటున్నారనీ, లోన్ ఆప్‌లను నమ్మి డబ్బులు అప్పుగా తీసుకోని వారి ఒత్తిడికి విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని, ఎవరైనా సైబర్ నేరగాళ్ల మోసాలకు గురి అయితే వెంటనే సైబర్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ 1930కు కాల్ చెయ్యాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్‌తో పాటుగా క్యాతనపల్లి మున్సిపాలిటీ కమీషనర్ గద్దె రాజు,ఏఎస్ఐ వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, కానిస్టేబుల్ సురేష్, స్వాతి విద్యార్థినులు పాల్గొన్నారు.

## బామ్మర్ది చేతిలో బావ దారుణ హత్య

**తలమడుగు ఫిబ్రవరి 18 సూర్య మేజర్ న్యూస్:**

తన బావకు అక్రమ సంబంధం ఉందని బామ్మర్ది బావను కత్తితో పొడిచి చంపిన సంఘటన తలమడుగు మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్ళగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తలమడుగు మండలంలోని రుయ్యడి గ్రామంలో కూలీ పనికి అత్తవారి గ్రామానికి మహేందర్ రావడం జరిగింది. అదే గ్రామంలో గత 13 సంవత్సరాలుగా అద్దెకు ఉంటున్నారు. గత వారం రోజుల క్రితం మహేందర్ భార్య నవీత తన భర్తను అనుమానం పడుతూ అక్రమ సంబంధం ఉందని గొడవ జరిగింది. గొడవ జరిగిన తర్వాత మహేందర్ తన గ్రామం తంతోలీకి వెళ్లి కుటుంబ సభ్యులకు నన్ను అనుమానిస్తున్నారని తెలిపారు. సోమవారం సాయంత్రం మహేందర్ బామ్మర్ది కుర్మా అశోక్ బావకు ఫోన్ చేసి పిల్లలు జ్ఞాపకం చేస్తున్నారు రమ్మని మహేందర్ కు కబురు చేశారు. మంగళవారం రోజు మృతుడు మహేందర్ మధ్యాహ్నం 12 గంటలకు రుయ్యడి గ్రామానికి చేరుకోగా కుర్మా అశోక్ అరేయ్ మహేందర్ మా అక్కను ఇచ్చి పెళ్లి చేసాం పిల్లలను కన్నారు ఇప్పుడు నికు అక్రమ సంబంధం అవసరమా అని కొట్టి చంపాలని ఉద్దేశంతో చాకుతో చాతిలో ఎడమవైపున పొడవడంతో గాయమై అక్కడికక్కడే మరణించినట్లు మహేందర్ యొక్క తమ్ముడు కొక్కుర్ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం అదిలాబాదు రూరల్ సీఐ ఫణిదర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు ఒక కూతురు ఉన్నట్లు తెలిపారు.

---

## నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

### - తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 18,సూర్య మేజర్ న్యూస్:**

తాండూర్ సర్కిల్ మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు నియంత్రించేందుకు, ప్రజలకు దగ్గర అయ్యేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి తెలిపారు. మంగళవారం ఉదయం తెల్లవారుజామున సర్కిల్ పరిధిలోని మాదారం టౌన్షిప్ లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 50ద్విచక్ర వాహనాలను, 10 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు సి.ఐ కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ప్రజల రక్షణ, ప్రజలకు భద్రత భావం, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి, ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుసుకునేందుకు మరియు చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారా వంటి విషయాలు తెలుసుకెందుకు ఈ ప్రోగ్రామ్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వాహన దారులు తప్పకుండా అన్ని



డాక్యుమెంట్స్ డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్స్యూరెన్స్ కలిగి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారికి కొత్త చట్టాలలో జరిమానాలు, శిక్షలు పెంచడం జరిగిందన్న విషయన్ని ప్రజాలు గ్రహించాలని అన్నారు.మహిళల భద్రతే పోలీస్ ప్రధాన లక్ష్యం అని, మహిళ పట్ల, చిన్న పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, వారిని మానసిక, శారీరకంగా హింసించిన వారిపట్ల చట్టపరమైన కఠిన చర్యలుచేపట్టి కేసులు నమోదు చేయడం జరుగుతుంది, వారి రక్షణ కోసం షి టీమ్స్ నిరంతరం పని చేస్తున్నాయని అన్నారు. వాహనాలకు సంబంధించి సరైన ధృవ పత్రాలు చేక్ చేసి తమ వాహనాలు తిరిగి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ప్రజలు, మహిళలు ఆపద సమయంలో, ఎవరైనా చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన, యువకులు గుంపులు గా ఏర్పడి బహిరంగ మద్యపానం సేవించిన, ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రజల రక్షణ కొరకు పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారు అని తెలిపారు. వ్యాపార సముదాయాల దగ్గర, కాలనీ లలో, మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మీ కాలనీలో ఎవరైనా కొత్తవారు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే వెంటనే పోలీస్ లేదా డయల్ 100 కు ఫోన్ చేసిన వెంటనే చర్యలు చేపడతామన్నారు. తనిఖీలు నిర్వహించడం వలన నేరాల రేటు తగ్గుతాయని ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని తెలిపారు.అలాగే సైబర్ నేరాల పాట్ల జాగ్రత్తగా ఉండాలనీ, మొబైల్ ఫోన్స్ లను జాగ్రత్తగా వినియోగించాలని, చిన్న చిన్న తప్పులతో విలువైన డబ్బులను పోగొట్టుకోవద్దు అని, ఎవరైనా సైబర్ నేరాల కు గురైతే వెంటనే 1930 కు కాల్ చేయలని లేదా లోకల్ పోలీస్ లను సంప్రదించాలని అన్నారు. అనంతరం పోక్సో కేసుల నమోదు, శిక్షలు , బాల్య వివాహాలు, బాల్య కార్మిక వ్యవస్థ పర్యవ్యాసనల గురించి, ట్రాపిక్ రూల్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్, మాదారం ఎస్సై సౌజన్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

---

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి శేఖర్ రావుకే మద్దతు - జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి

**జన్నారం, ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్ :**

త్వరలో జరగనున్న పట్టభద్రుల ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావుకు తాము మద్దతు ఇస్తున్నామని ఎట్టి పరిస్థితిలో గెలిపించుకుంటామని మంచిర్యాల జిల్లా ట్రస్మా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం విలేకరులతో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని అనేక దఫాల్లో ఆదుకున్న వ్యక్తి శేఖర్ రావు అని అన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో పనిచేశారని, కరోనా సమయంలో ఎంతోమందిని ఆదుకున్న వ్యక్తి అని, అలాంటి వ్యక్తికి అండగా నిలవడం జరిగిందని అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శేఖర్ రావుని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాముల మధుసూదన్, మండల ప్రధాన కార్యదర్శి కస్తూరి సతీష్ కుమార్, అంజిత్ రావు లు ఉన్నారు.



---

## మాదిగ హక్కుల దండోరా నాయకుల పరామర్శ

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి మండలంలోని బట్వన్ పల్లి గ్రామనివాసి ఇడీగిరాల భీమయ్య ఇల్లు కరెంటు షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరుగలేదు. ఇంట్లోని విలువైన సామాగ్రి, కొంత మేర నగదు కాలిపోయి పూర్తిగా నిరాశ్రయులైనారు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న మాదిగ హక్కుల దండోరా నాయకులు వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి కొంతమేర వంట సామాగ్రి, బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసి వారి కుటుంబానికి సానుభూతి తెలియజేసారు.ఈ సందర్భంగా మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ చిలుక రాజనర్సు మాదిగ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి వెంటనే స్పందించి పూర్తిగా నష్టపోయిన ఇడిగిరాల భీమయ్య కు యుద్ధ ప్రాతిపదికన ఇల్లు నిర్మించి ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.అంతే కాకుండా తక్షణమే ఒక లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుషణపల్లి నారాయణ, సీనియర్ నాయకులు కుషణపల్లి రాజలింగు, జిల్లా అధికార ప్రతినిధి ఇడిగిరాల ప్రసాద్, జిల్లా కార్యదర్శి గోగర్ల శేఖర్, ఆయిల్ల శంకర్, మండల అధ్యక్షుడు నాతరి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

**- నిరుద్యోగులకు 57వేల ఉద్యోగాలు ఇచ్చాం, జాబ్ క్యాలెండర్ అమలుపరుస్తున్నాం - బెల్లంపల్లిలో ఐటీ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తా.**

**- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు.**

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్:**
రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడ్డ 26నెలల కాలంలో నిరుద్యోగులకు 57వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఇచ్చిన



మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ అమలుపరుస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళశ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం రాత్రి బెల్లంపల్లి పట్టణంలోని ఆర్ పి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో మంత్రి పాల్గొని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ పట్టభద్దుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి కే నరేందర్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మొక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతో కలిసి మంత్రి పాల్గొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై చేస్తున్న. దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బెల్లంపల్లి పట్టణంలో రానున్న రోజుల్లో ఐటీ పార్కు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27న జరగనున్న పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గంలోని పట్టబద్ధులు విద్యాభివృద్ధి కృషి చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి ఓట్లు వేసి అధిక మెజార్టీ తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ జక్కుల శ్వేత, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ముచ్చర్ల మల్లయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గట్టు మురళీధర్ రావు, ఎం నర్సింగరావు, మునిమంద రమేష్, రుద్ర బట్ల సంతోష్, బండి ప్రభాకర్ యాదవ్, నాతరి స్వామి, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

### ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన

# జాతీయ స్థాయి బృందం

**మందమర్రి, ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్.**
ఆరోగ్య సంరక్షణ సేవల నాణ్యతను మెరుగు పరచి మార్గదర్శకత్వం అందించేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ వైద్యులు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్ బృంద సభ్యులు పట్టణంలోని దీపక్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న సేవలను రికార్డులను పరిశీలించి రోజు ఎంతమంది ఓపి చూస్తున్నారని, ఇన్ పేషంట్ల సంఖ్య పేషెంట్లకు అందిస్తున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాలకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందించడానికై ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, కల్పిస్తున్న సదుపాయాలు, నిధులు, విధులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఆయుష్మాన్ భవ, డిజిటల్ సేవలు, వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్యులు, ఇతర సిబ్బంది సమిష్టిగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్ నాయక్, ఉపవైద్యాధికారి డాక్టర్ మానస, ప్రశాంతి, డిపిఓ వెంకటేశ్వర్లు, సిహెచ్ఓ వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



### బీసీలలో ముస్లింలను

# ఎట్లా కలుపుతారు?

**- కాంగ్రెస్ నాయకులులలో హిందుత్వం సచ్చిపోయిందా - రాహుల్ గాంధీ అసలు హిందువే కాదు-కేంద్ర మంత్రి బండి సంజయ్**



**మంచిర్యాల టౌన్,సూర్య మేజర్ న్యూస్ :**
బీసీలో ముస్లింలను కలిపి 42శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తునట్టు అంటున్న కాంగ్రెస్ పార్టీ ద్వంద వైఖరి గ్రాడ్యుయేట్లు, విద్యావంతులు గ్రహించాలని కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తాండ్ర పాపారాయడు మినీ ఫంక్షన్ హాల్లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం



లో బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు బి ఆర్ ఎస్ పార్టీ మీద కోపంతో కాంగ్రెస్ పార్టీ కి పట్టం కడితే గత 16నెలలు గా తెలంగాణ ప్రజలు ను అన్ని రంగాలలో మోసం చేస్తుంది అని అన్నారు.బీసీలలో ముస్లింలను కలుపుతారట,ఎవ్వడయ్య జాగారి,కాంగ్రెస్ పార్టీ ముస్లింలను కలిపి రిజర్వేషన్ బిల్ కేంద్రంకి పంపితే ఆ బిల్‌ను లామినేషన్ చేసి తిరిగి పంపిస్తా,ఇంట్లో పెట్టుకోండి అని కాంగ్రెస్ పార్టీ నాయకలను హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ అది నాయకుడు రాహుల్ గాంధీ అసలు హిందువే కాదని,ఫిరోజ్‌ఖాన్ కొడుకు రాజీవ్ ఖాన్,రాజీవ్ ఖాన్ కొడుకు రాహుల్ ఖాన్ ఐతారని సంజయ్ అన్నారు.అంతర్జాతీయ నిషేధిత ఉగ్రవాద సంస్థకు వికారాబాద్‌లో సభ నిర్వహించుకోడానికి 2కోట్లు రూపాయలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు.రంజాన్ పండగకు ఉద్యోగులకు 4 గంటలకు ఇంటికి వెళ్లేలా సర్కులర్ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంకు అయ్యప్ప స్వామి భక్తులకు,హనుమాన్ మాల వేసుకున్న భక్తులకు పని వేళలో వేసలు బాటు ఇవ్వాలనే ఆలోచన రాకపోవడం వారి హిందూ వ్యతిరేక విధానానికి నిదర్శనం అని అన్నారు. మంచిర్యాలలో కూడా సుమారు 500మంది మీద అక్రమ కేసులు బాణాయసస్తూ, బీజేపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురించేస్తున్నారు అని అన్నారు.ఇంకో 6నెలలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది అని,బీజేపీ ప్రభుత్వం వస్తుంది అని అన్నారు.బీజేపీ కార్యకర్తలుకు పోరాటాలు కొత్తకాదని,లాఠి దెబ్బలు కొత్తకాదని అన్నారు.మేధావులు, విద్యావంతులు, గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులు కాంగ్రెస్ ప్రభుత్వంకి గట్టి గుణపాఠం చెప్పే సమయం వచ్చిందని అన్నారు.మెదక్, కరీంనగర్,ఆదిలాబాద్, నిజామాబాదు ఉపాధ్యాయ,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్కా కొమ్మురయ్య,చిన్నమలై అంజి రెడ్డి ని గెలిపించి పెద్దల సభ లో ప్రశ్నించే గొంతుక కు అవకాశం ఇవ్వాలని కోరారు.కాంగ్రెస్ అభ్యర్థి కి వారి పార్టీ ఎమ్మెల్యేలే సపోర్ట్ లేదని,అయినకి కనీసం ఏజెంట్లు కూడా లేరని అన్నారు. అయినా పాఠశాలలో పని చేసే సిబందితో ప్రచారం చేపిస్తున్నారని అన్నారు.హిందూత్వం కాపాడుకోవాలంటే బీజేపీ అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేష్,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమలై అంజి రెడ్డి,సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, కామారెడ్డి ఎమ్మెల్యే కటపల్లి వెంకట రమణ రెడ్డి,బీజేపీ మాజీ అధ్యక్షులు ఎర్రబెల్లి రఘునాథ్,బీజేపీ నాయకులు, డాక్టర్లు, గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాలుగోన్నారు.

## నిర్మల్ డిపోలో పవర్ ప్రోగ్రామ్.

**నిర్మల్ ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్**
ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ సూచనల మేరకు డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో ప్రోజెక్టర్ ద్వారా పవర్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు ముఖ్య అతిథి గాఆదిలాబాద్ రీజియన్ డిప్యూటీ ఆర్.ఎం. ఎమ్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.ఆర్టీసీ ఉద్యోగుల్లో నైపుణ్యాన్ని,సృజనాత్మకతను పెంచుకోవడానికి ఈ ప్రోగ్రామ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఉద్యోగులు ఇది నాది ఈ సంస్థ నాది అని పనిచేయాలని,అప్పుడే మనం తృప్తి చెందుతామని, ప్రతి ఒక్క ఉద్యోగి స్వంత పనిలాగా భావించి పనిచేయాలని,ప్రయాణికుల మన్ననలు పొందాలని,ప్రయాణికుల పట్ల మార్యదగా ప్రవర్తించాలని,ప్రయాణికుడు మనపై ఆధార పడి లేడని ప్రయాణికుని పైనే మనం ఆధారపడి ఉన్నామని అందరూ ఆలోచించాలని డిప్యూటీ ఆర్ ఎం.( ఎమ్ ) ప్రవీణ్ కుమార్ తెలిపారు. డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రోగ్రామ్ ద్వారా అందరూ నేర్చుకోవలసింది ఎంతో ఉందని,ఈ క్లాసులు రోజు ఉంటాయని,మన డిపో లో ఉన్న ప్రతి ఉద్యోగి ఈ క్లాసులకు రావాలని ప్రతి రోజు ఉదయం 9 గం. ల నుండి సాయంత్రం 5 గం. ల వరకు నిర్వహిస్తామని తను తెలిపారు.కార్యక్రమములో అసిస్టెంట్ మేనేజర్ ఐ. రాజశేఖర్,ఏ.ఈ.( ఎం) నవీణ్ కుమార్,ఉద్యోగులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి భాగ్యరెడ్డి వర్మ

**వాంకిడి ఫిబ్రవరి 18సూర్య మేజర్ న్యూస్**
అణగారి నా వర్గాల ఆశజ్యోతి భాగ్యరెడ్డి వర్మ అని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహూల్కర్ అన్నారు.మంగళవారం వాంకిడి మండల కేంద్రంలోని బుద్ధ విహార్లో నిర్వహించిన భాగ్యరెడ్డి వర్మ 86వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు . అణగారిన వర్గాలో ఆత్మస్థైర్యం నింపడానికి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో అనేక సంఘ సేవ, కుల నిర్మూలన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలల్లో ధైర్యాన్ని నింపారని, కుల వివక్షను దృష్టిలో పెట్టుకొని 1915లో బుద్ధ పూర్ణిమ రోజు బౌద్ధమతం స్వీకరించారని అన్నారు. 22 మే 1888 న జన్మించిన అతను 18 ఫిబ్రవరి 1939 లో కేవల 51 సంవత్సరాలకే క్షయ వ్యాధితో మరణించాడని,అతని సేవలను గుర్తించిన ప్రభుత్వం పాఠ్యా పుస్తకాల్లో చేర్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ సమాజ్ అధ్యక్షులు విలాస్ కొబ్రాగడే, మనోజ్ ఉప్రే,యేష్పాల్ ఉప్రే, కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు దుర్గం ప్రశాంత్,కిరణ్,రాంటెకె శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ లో గ్రూపులు

# కడితే క్రమశిక్షణ చర్యలు

**- ఎమ్మెల్యే బొజ్జు పటేల్**

**జన్నారం, ఫిబ్రవరి 18, సూర్య మేజర్ న్యూస్ :**
ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని పార్టీలో ఉంటూ గ్రూపులు కడితే క్రమశిక్షణ చర్యలు తీసుకోవలసి వస్తుందని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెద్య బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. మంగళవారం జన్నారం మండల కేంద్రంలో గల ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో బొజ్జు పటేల్ పాల్గొని మాట్లాడారు. త్వరలో జరగనున్న కరీంనగర్ మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరి నరేందర్ రెడ్డి ని గెలిపించుటకు సైనికుల్లాగా పని చేయాలన్నారు. పేదల పెన్నిధి ఆపదలో ఉన్న వారిని ఆదరించి చేరదీసే వ్యక్తి నరేందర్ రెడ్డిని గెలిపించుటకు కలసికట్టుగా కార్యకర్తలు ప్రతి ఓటర్ వద్దకు వెళ్లి ఓట్లు అడగాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే విధంగా ఎవరు వ్యవహరించిన ఊరుకునే ప్రసక్తే లేదని, ఎవరు ఏ స్థాయిలో పనిచేస్తున్నారో ఎప్పటికప్పుడు గమనిస్తున్నానని అన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్ అలీఖాన్, మేకల మాణిక్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గ%శీ% లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసియుల్లా, జిల్లా మండల నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, మహమ్మద్ రియాజుద్దీన్, సయ్యద్ ఇసాక్, మచ్చ శంకరయ్య, అల్లం రవి, కంప సుధీర్, గుర్రం మోహన్ రెడ్డి, ఏనుగు సుభాష్ రెడ్డి, లక్ష్మి, పంకజ, దుమల్ల రమేష్, మామిడిపల్లి ఇందయ్య తదితరులు పాల్గొన్నారు.

